క్లుప్తంగా

రైల్వే వెహికిల్ స్టాండ్ ప్రారంభం



డోర్నకల్ : మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్ ఆవరణలో వెహికిల్ స్టాండ్‌ను మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న ప్రారంభించారు. తొలుత స్టాండ్‌లో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు జక్కుల వెంకటేశ్వర్లు, స్టాండ్ నిర్వాహకుడు బత్తుల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్లలో తనిఖీ



మరిపెడ : మండల కేంద్రంలోని ఎస్సీ బాలికల, బీసీ బాలుర హాస్టళ్లను స్పెషల్ ఆఫీసర్ (ఎస్‌ఓ) కృష్ణమూర్తి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. భోజనం, ఇతర సౌకర్యాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. వర్షాకాలం నేపథ్యంలో పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మరుగుదొడ్లను శుభ్రం చేయించాలని చెప్పారు. విద్యార్థులకు వార్డెన్లు అందుబాటులో ఉండాలన్నారు. ఆయన వెంట ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు పెదబోయిన వీరబాబు, వార్డెన్ స్వరూప తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓ తనిఖీ

నెల్లికుదురు : మండలంలోని వివిధ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను ఎంఐఎస్ కోఆర్డినేటర్ మచ్చురపరి సుధాకర్‌తో కలిసి ఎంఈఓ రాము గురువారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన ఉపాధ్యాయులకు సూచించారు.

సీజనల్ వ్యాధులపై నేడు సదస్సు

చిన్నగూడూరు : జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నేడు (శుక్రవారం) ఉదయం 11 గంటలకు మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో సీజనల్ వ్యాధులపై అవగాహనా సదస్సు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ శ్యాం సుందర్, ఉగ్గంపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి కరుణాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సును వినియోగించుకోవాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, వైద్యసిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు సకాలంలో హాజరు కావాలని కోరారు.

రచయితల సంఘం కన్వీనర్‌గా వీరన్న



మరిపెడ రూరల్ : తెలంగాణ సామాజిక రచయితల సంఘం మండల కన్వీనర్‌గా మండలంలోని ఎల్లంపేట గ్రామానికి చెందిన రచయిత, కవి వీరన్న ఎంపికయ్యారు. ఈ మేరకు వీరన్నకు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఇమ్మడి రాంబాబు నియామక పత్రాన్ని గురువారం అందజేశారు. ఈ సందర్భంగా రాంబాబు మీడియాతో మాట్లాడారు. సమాజానికి దిక్సూచి రచయితలేనని చెప్పారు. ఒక్క సిరా చుక్క లక్ష మెదళ్లను కదిలిస్తుందని తెలిపారు. రచయితలు సమాజ వికాసానికి కృషి చేస్తూ సామాజిక అంశాలపై దృష్టి కేంద్రీకరించి రచనలు సాగించాలని ఆకాంక్షించారు. తన ఎన్నికకు కృషి చేసిన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామిడి సతీశ్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఇమ్మడి రాంబాబులకు వీరన్న కృతజ్ఞతలు తెలిపారు.

బీవైఎస్ జిల్లా అధ్యక్షుడిగా హరికృష్ణ నియామకం

డోర్నకల్ : భారత యాదవ సమితి (బీవైఎస్) జిల్లా అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన ఎల్లావుల హరికృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు హరికృష్ణకు రాష్ట్ర అధ్యక్షుడు దాసరి నాగేశ్ యాదవ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్ది రమేశ్ నియామక పత్రాన్ని అందించారు. అనంతరం హరికృష్ణ విలేకరులతో మాట్లాడారు. యాదవుల సమస్యల పరిష్కారానికి సహకారం అందిస్తానని తెలిపారు.

ఎమ్మెల్యేను కలిసిన సీఐ

చిన్నగూడూరు : స్థానిక సీఐగా బాధ్యతలు చేపట్టిన రాజు మండలంలోని ఉగ్గంపల్లిలో ఎమ్మెల్యే రెడ్యానాయక్‌ను గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం ఎంపీపీ, జెడ్పీటీసీ, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు నాలుగేళ్ల పదవీ కాలం పూర్తయిన నేపథ్యంలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో ఎంపీపీ గుగులోత్ అరుణ, జెడ్పీటీసీ తేజావత్ శారద, తాళ్లపల్లి రఘు, తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

జీపీ ఉద్యోగ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జిల్లావ్యాప్తంగా సీఐటీయూ, పంచాయతీ వర్కర్స్ జేఏసీ ఆధ్వర్యంలో గురువారం ఆందోళనలు నిర్వహించారు. కురవిలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ మద్దతు తెలిపి మాట్లాడారు. ప్రభుత్వ తీరును ఎండగట్టారు. సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమాలు తప్పవన్నారు.

–సాక్షి నెట్‌వర్క్



మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్‌లో..



కురవిలో..



బయ్యారంలో..



మరిపెడలో..

ప్రధాని సభను విజయవంతం చేయాలి

మరిపెడ/మహబూబాబాద్ రూరల్ : ఈనెల 8న హనుమకొండలో నిర్వహించనున్న ప్రధాని మోదీ సభను విజయవంతం చేయాలని మాజీ ఎంపీ, బీజేపీ నేత రవీందర్‌నాయక్, ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పోరెడ్డి కిశోర్ కోరారు. మరిపెడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రవీందర్‌నాయక్, మహబూబాబాద్‌లోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో కిశోర్ మీడియాతో మాట్లాడారు. రూ.6,100 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు, కాజీపేటలో రూ.500 కోట్లతో చేపట్టనున్న రైలు వ్యాగన్ల కర్మాగార నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారని తెలిపారు. పార్టీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



మరిపెడలో మాట్లాడుతున్న రవీందర్‌నాయక్



మహబూబాబాద్ అర్బన్ : మాట్లాడుతున్న కిశోర్

శ్రీవారికి శ్రవణానక్షత్ర అభిషేకాలు



మహబూబాబాద్ రూరల్ : శ్రవణా నక్షత్రం సందర్భంగా జిల్లా కేంద్రంలోని శ్రీరామ ఆలయంలోని శ్రీవేంకటేశ్వర స్వామి వారికి గురువారం ప్రత్యేక అభిషేకాలు, పూజలు వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఎం వీ.కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో తెల్లవారుజామున పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. ప్రత్యేక అలంకరణ, పూజల అనంతరం స్వామివారి భక్తులకు దర్శనం కల్పించారు.

జీవిత బీమాతో కుటుంబాలకు ధీమా

● ఎల్‌ఐసీ బ్రాంచ్ మేనేజర్ కె.వెంకటేశ్వర్లు

మరిపెడ రూరల్ : జీవిత బీమా చేయించుకోవడం ద్వారా పాలసీదారుల కుటుంబాలకు ధీమా లభిస్తుందని ఎల్‌ఐసీ మహబూబాబాద్ బ్రాంచ్ మేనేజర్ కే.వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని లచ్చతండకు చెందిన గుగులోతు రాజు– సరోజ దంపతులు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన క్రమంలో ఆ ఇద్దరికీ పాలసీలు ఉండడంతో రూ.4.07 లక్షల బీమా డబ్బును బాధిత కుటుంబానికి మేనేజర్ వెంకటేశ్వర్లు గురువారం అందజేసి మాట్లాడారు. ప్రజలందరూ బీమా చేయించుకుని కుటుంబాలకు ధీమా కల్పించాలని సూచించారు. ఏజెంటుగా గుగులోతు వీరన్న 1800 పాలసీలు చేసి జోనల్ మేనేజర్ క్లబ్ మెంబర్‌గా ఎంపిక కావడంతోపాటు మిలియన్ డాలర్ రౌండ్ టేబుల్ మెంబర్‌షిప్ అందుకోవడం అభినందనీయని తెలిపారు. మండలంలోని బాల్నిధర్మారం గ్రామం నుంచి ఎల్‌ఐసీకి ఎక్కువ ప్రీమియం చెల్లించగా ఆ గ్రామాన్ని రెండు సార్లు బీమా గ్రామంగా ప్రకటించి ఎల్‌ఐసీ నుంచి లక్ష రూపాయలు అందించినట్టు చెప్పారు. లచ్చతండా గ్రామ పంచాయతీకి రూ.50 వేలు అందించినట్లు వివరించారు. సమాజంలోని ప్రతిఒక్కరూ కుటుంబాలకు భరోసా కల్పించేలా జీవిత బీమా చేయించుకోవాలని సూచించారు. ఏజెంట్లు నిరంతరం సేవలు అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్‌ఐసీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (డీఓ) నర్సింహారావు, గుగులోతు నరేందర్, గుగులోతు బాలు, శ్రీను, దేవేందర్, సాగర్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.



చెక్కు పంపిణీ చేస్తున్న మేనేజర్ వెంకటేశ్వర్లు

‘వైద్యరత్న’కు సన్మానం



గార్ల : స్థానిక సీహెచ్‌సీ వైద్యుడు రాజ్‌కుమార్ జాదవ్ ఇటీవల డాక్టర్స్ డే సందర్భంగా మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా వైద్యరత్న అవార్డు అందుకోగా ఆయన్ను మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో ప్రజాప్రతినిధులు శాలువాలతో గురువారం సత్కరించారు. భవిష్యత్‌లో మరిన్ని అవార్డులు, సత్కారాలు పొందాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజ్‌కుమార్‌ను వైద్యులు, సిబ్బంది అభినందించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మాలోత్ వెంకట్‌లాల్, నాయకులు వేశమల్ల రాజశేఖర్, సుశీలా బాయి, గంగావత్ అశోక్, బి.మోహన్, కిషన్‌నాయక్, మోహన్, రాములు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి

జిల్లావ్యాప్తంగా బాబు జగ్జీవన్ రామ్ 36వ వర్ధంతిని గురువారం నిర్వహించారు. అంబేడ్కర్, వివిధ సంఘాల నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు జగ్జీవన్ రామ్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

–సాక్షి నెట్‌వర్క్



మహబూబాబాద్‌లో నివాళులర్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ ప్రసన్న రాణి, తదితరులు

రూ.200 కోట్లతో నియోజకవర్గ అభివృద్ధి

● డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్.రెడ్యానాయక్

కురవి : సీఎం కేసీఆర్ మంజూరు చేసిన రూ.200 కోట్ల వ్యయంతో డోర్నకల్ నియోజకవర్గ అభివృద్ధి జరుగుతోందని ఎమ్మెల్యే డీఎస్.రెడ్యానాయక్ తెలిపారు. సీరోలు మండలంలోని చింతపల్లి తోపాటు శివారు తండాలు, సీరోలు, రేకుల తండా, కొర్లకుంట తండా, సక్రాంనాయక్ తండా జీపీల్లో గురువారం ఆయన పర్యటించారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. మహిళలతో కలిసి కోలాటమాడి ఆకట్టుకున్నారు. బతుకమ్మలతో ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. తాను ఇప్పటివరకు 7 సార్లు పోటీ చేయగా కేవలం ఒకసారి మాత్రమే ఓడిపోయానని చెప్పారు. తనకు టికెట్ రాదని గిట్టని వాళ్లు సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారని తెలిపారు. టికెట్ ఇస్తానంటూ సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారని చెప్పారు. చింతపల్లి–సీరోలు మధ్య కల్వర్టుపై వంతెన నిర్మాణానికి రూ.2 కోట్ల వ్యయంతో చేపట్టిన పనులకు శంకుస్థాపన చేశారు. కురవి నుంచి మొగిలిచర్ల డబుల్ రోడ్డుకు రూ.10 కోట్లు, నియోజవర్గంలో 2500 పక్కా గృహాలు, మరిపెడలో 100 పడకల ఆస్పత్రికి నిధులు మంజూరు చేసినట్టు తెలిపారు. నియోజకవర్గ ప్రజలను ఓటు అడిగే హక్కు ఇతర పార్టీల నాయకులకు లేదన్నారు. చింతపల్లి శివారు కొత్తతండాకు రోడ్డు నిర్మాణం కోసం 10 గుంటల భూమి ఇచ్చిన భూక్య సాంక్రియా కుటుంబాన్ని సన్మానించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ గుగులోత్ పద్మావతి, వైస్ ఎంపీపీ నర్సయ్య, ఆర్‌బీఎస్ మండల కోఆర్డినేటర్ రమేశ్, ఆత్మ చైర్మన్ లాలయ్య, సర్పంచ్‌లు కవిత, శ్యామల రంగమ్మ, ఎంపీటీసీ భోజ్యానాయక్, తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంపీడీఓ సరస్వతి పాల్గొన్నారు.



బ్రిడ్జి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

పోడు సాగుదారులందరికీ పట్టాలివ్వాలి



జిల్లా కేంద్రంలో మాట్లాడుతున్న అజయ్‌సారథి



గూడూరులో ఆందోళన చేస్తున్న గిరిజన రైతులు

నెహ్రూసెంటర్/మహబూబాబాద్ రూరల్ : జిల్లాలోని పోడు సాగు చేసుకుంటున్న రైతులందరికీ పట్టాలివ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి, కిసాన్ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ పెరుమాండ్ల గుట్టయ్య గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పోడు రైతుల పోరాట కేసుల్లో భాగంగా కోర్టుకు హాజరైన సందర్భంగా జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో విజయసారథి, బెల్లయ్య నాయక్ క్యాంప్ కార్యాలయంలో మాట్లాడారు. పోడు రైతులపై, నాయకులపై బనాయించిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలన్నారు. పోడు పట్టాలపై 2014 నుంచి ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలన్నీ నీటిమీద రాతలుగా మారాయన్నారు.

ఆందోళన

గూడూరు : పోడు పట్టాలివ్వాలని డిమాండ్‌చేస్తూ మండల పరిషత్ కార్యాలయం ఎదుట గుండెంగ, తేజావత్‌రాంసింగ్‌తండా గ్రామాల గిరిజన రైతులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా గుండెంగ ఎంపీటీసీ బోడ కిషన్, తేజావత్ రాంసింగ్‌తండా సర్పంచ్ బోడ మంగీలాల్‌నాయక్ మాట్లాడారు. అధికారులు ముడుపులు దండుకొని అర్హులకు అన్యాయం చేశారని విమర్శించారు.

సంక్షిప్త సమాచారం

సన్మానం

కేసముద్రం : కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా ఎంపికైన అల్లం నాగేశ్వర్‌రావును మండల కేంద్రంలో ధన్నసరి యాదవ సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ధన్నసరి ఉపసర్పంచ్ బానోతు వెంకన్న, బండారు దయాకర్, నర్సింహారెడ్డి, బోడ విక్కి, సుధాకర్, వెంకన్న, రాజు, శ్రీధర్, తండా మహేష్, అశోక్, రాజు, యాకన్న తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణలో జాగ్రత్తలు పాటించాలి

గూడూరు : ఆశ్రమ పాఠశాలల విద్యార్థినులు వర్షాకాలం నేపథ్యంలో ఆరోగ్య పరిరక్షణలో జాగ్రత్తలు పాటించాలని హోమియో వైద్యురాలు ఆర్.రజిత సూచించారు. మండల కేంద్రంలోని ఎంజేపీ, బీసీ వెల్ఫేర్ బాలికల విద్యాలయంల్లోని విద్యార్థులకు ఆమె గురువారం వైద్యపరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య జాగ్రత్తలు, పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. దగ్గు, జ్వరం తదితరాల నుంచి కాపాడుకునేలా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విద్యాలయ ప్రిన్సిపాల్ శ్వేత, ఉపాధ్యాయ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల్లోని సమస్యలను పరిష్కరించాలి

కురవి : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ దేవేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ సంఘం ఆధ్వర్యంలో మండలంలోని గుండ్రాతిమడుగు (విలేజి) జెడ్పీ హైస్కూల్ ఆవరణలో గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవేందర్ మాట్లాడారు. విద్యార్థులకు యూనిఫాం, పాఠ్యపుస్తకాలు అందించడంతోపాటు మరుగుదొడ్లు, మూత్రశాలలు నిర్మించాలని, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని చెప్పారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని వినతి

కేసముద్రం : ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని కోరుతూ పీడీఎస్‌యూ కాకతీయ యూనివర్సిటీ కమిటీ కార్యదర్శి కామగోని శ్రావణ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఎమ్మార్సీలో మండల కోఆర్డినేటర్ షేక్ ఖాదర్‌కు వినతిపత్రాన్ని గురువారం అందజేశారు. ఈ సందర్భంగా శ్రావణ్ మాట్లాడారు. పాఠశాలల్లో కనీస మౌలిక సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ‘మన ఊరు–మన బడి’ కింద ఎంపికైన పాఠశాలలో పనులు పూర్తి చేయలేదన్నారు.

రథయాత్ర పోస్టర్ల ఆవిష్కరణ

బయ్యారం : పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ ఈనెల 20న టీఎస్ సీపీఎస్‌ఈయూ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రథయాత్ర వాల్‌పోస్టర్లను మండల కేంద్రంలోని బాయ్స్ హైస్కూల్‌లో ఆ సంఘం మండల అధ్యక్షుడు రవీందర్ నాయక్ గురువారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. రథయాత్రను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు జి.రవీందర్ నాయక్, మోహన్, వీరన్న, బాలు, కౌసల్య, అరుణాదేవి, వెంకన్న, వెంకటనారాయణ, రాంనాయక్, చంద్రమోహన్, సుధాకర్, లక్ష్మీనారాయణ, కస్నా, కృష్ణ, కరుణ్‌సింగ్ పాల్గొన్నారు.

జీపీ సిబ్బందికి వేతనాలు పెంచాలి

తొర్రూరు : గ్రామ పంచాయతీ సిబ్బందికి వేతనాలు పెంచాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జేఏసీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పంచాయతీ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలని, జీఓ నంబర్ 51ని సవరించి కొత్త నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు పాడ్యా బీకు, మండల అధ్యక్షుడు గుండాల సోమనర్సయ్య, ప్రతినిధులు అశోక్, ప్రశాంత్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

మండల అధ్యక్షుడి తొలగింపు సరికాదు

డోర్నకల్ : కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల శ్రీనివాస్ యాదవ్ తొలగింపు సరికాదని ఆ పార్టీ గ్రామ కమిటీల అధ్యక్షులు, నాయకులు అన్నారు. మండలంలోని పెరుమాళ్ల సంకీస గ్రామంలో నిర్వహించిన సమావేశంలో పలు గ్రామాలకు చెందిన కమిటీల అధ్యక్షులు, నాయకులు మాట్లాడారు. శ్రీనివాస్ యాదవ్ ప్రతికూల పరిస్థితుల్లో అధ్యక్షుడిగా పార్టీ బలోపేతానికి కృషి చేశారని తెలిపారు. అధ్యక్ష పదవి నుంచి శ్రీనివాస్‌ను తొలగించడం ఏకపక్ష నిర్ణయమని, పార్టీకి నష్టం జరిగే అవకాశాలున్నాయని చెప్పారు. అధ్యక్ష పదవి నియామకంపై పునరాలోచించాలని కోరారు. కాసం శేఖర్, పగిడిపాల వెంకటేశ్వర్లు, ఎలమద్ది వెంకయ్య, గండి బాబు, విష్ణువర్ధన్‌రెడ్డి ఉన్నారు.

రాష్ట్రస్థాయి షూటింగ్ పోటీల్లో ప్రతిభ



గూడూరు : మండల కేంద్రానికి చెందిన గౌడిశాల నవీన్ గౌడ్ హైదరాబాద్‌లో ఇటీవల జరిగిన 9వ రాష్ట్రస్థాయి షూటింగ్ పోటీల్లో ప్రతిభ కనబర్చాడు. అగస్టులో కేరళలో జరగనున్న సౌత్‌జోన్ షూటింగ్ చాంపియన్‌షిప్ పిస్టల్ ఈవెంట్స్‌కు ఆయన ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పిస్టల్ ఏయిర్ షూటింగ్‌లో ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. కోచ్ అల్లూరి ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో శిక్షణ పొందినట్టు తెలిపారు. తనకు కోచ్‌గా పని చేసిన సీఐ ప్రసన్నకుమార్, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

పాఠశాలకు ప్రింటర్, స్కానర్ బహూకరణ

మహబూబాబాద్ అర్బన్ : మండలంలోని శనిగపురం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు లయన్స్ క్లబ్ సభ్యుడు డాక్టర్ చాపల రంజిత్‌రెడ్డి–అన్నపూర్ణ దంపతులు గురువారం ప్రింటర్, స్కానర్ బహూకరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కనకయ్య, ఉపాధ్యాయులు రంజాన్ అలీ, క్లబ్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారి మాలె కాశీనాథ్, చైర్మన్ అనుమాండ్ల వెంకటేశ్వర్లు, సభ్యులు డాక్టర్ నాగవాణి, జగన్‌మోహన్‌రావు, రావుల రవిచందర్ రెడ్డి, జోలి సాయికిరణ్, శంతన్ రామరాజు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఐడీ, టై, బెల్టులు అందజేత

గూడూరు : విద్యార్థులు ప్రతీ ఒక్కరు పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని కప్పల సుశీలఐలయ్యగౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం ఆమె తన భర్త జ్ఞాపకార్థం పాఠశాల విద్యార్థులందరికీ ఉచితం ఐడీ, టై, బెల్టులను అందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం స్వరూప విద్యాభివృద్ధికి పాటుపడుతున్న దాతకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సీఆర్‌పీ కుందూరు శోభన్‌రెడ్డి, ఉపాధ్యాయులు స్వామి, ఉమారాణి, సునిత, జయశ్రీ, రాజ్యలక్ష్మి, సంధ్యారాణి, రమాదేవి, భారతి పాల్గొన్నారు.

స్నేహితుడి కూతురుకు అండగా..

కేసముద్రం : మండలంలోని వెంకటగిరి గ్రామానికి చెందిన గాండ్ల అశోక్ 2018లో అనారోగ్యంతో మృతి చెందాడు. అంతకు ముందే అతడి భార్య మృతి చెందింది. దీంతో తల్లిదండ్రుల మృతితో ఒంటరైన కుమార్తె శివానిని చదివించే బాధ్యతను అతడి స్నేహితులైన కేసముద్రం స్టేషన్ ఎస్‌వీవీ హైస్కూల్‌కి చెందిన 1996–97 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు తీసుకున్నారు. ఈ మేరకు చెన్నరావుపేటలోని అమ్మమ్మ ఇంటిదగ్గర ఉంటూ నర్సంపేటలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో చదువుకుంటున్న శివానికి గురువారం స్కూల్ ఫీజు, పుస్తకాలు, వ్యాన్ ఫీజు, డ్రెస్,బ్యాగ్‌లకు గాను రూ.35 వేల సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో వోమ సంతోష్, జలగం అనిల్, సామల రమేష్, సతీష్, రాంధాస్ పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

గార్ల : మండలంలోని చిన్నకిష్టాపురం గ్రామానికి చెందిన మాలోత్ బలరాం అతడి కొడుకు పక్షవాతంతో బాధపడుతుండడం, ఆర్థిక ఇబ్బందులు తాళలేక గురువారం గుళికలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఆయన్ను కుటుంబ సభ్యులు స్థానిక సీహెచ్‌సీకి తరలించి ప్రాథమిక చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. బలరాం ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని గ్రామస్తులు తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

మహబూబాబాద్ రూరల్ : విద్యుదాఘాతంతో గేదె మృతి చెందిన ఘటన మండలంలోని బలరాం తండాలో గురువారం చోటుచేసుకుంది. తండాకు చెందిన ఇస్లావత్ వెంకన్నకు సంబంధించిన గేదె మేత కోసం వెళ్తూ కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలకు తగిలి మృతి చెందింది. రైతుకు రూ.70 వేల నష్టం వాటిల్లింది. ఘటనపై పశు వైద్యుడు, విద్యుత్ అధికారులకు సమాచారం అందించారు.

చలో కలెక్టరేట్ కరపత్రాల ఆవిష్కరణ

దంతాలపల్లి : ఈనెల 10న తలపెట్టిన చలో కలెక్టరేట్ కార్యక్రమ కరపత్రాలను మండల కేంద్రంలో గీత కార్మి సంఘం సభ్యులు గురువారం ఆవిష్కరించారు. గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గీత కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో గీత కార్మిక సంఘం మండల అధ్యక్షులు గండి వెంకటనారాయణ, రాష్ట్ర కమిటీ సభ్యులు కొత్త అంతయ్య, తండ చిన్నరాములు, గుండగాని లింగయ్య, గీతకార్మికులు మొగుగాని కొమురయ్య, పాడిశెట్టి వెంకటనారాయణ, భూపతి యాకన్న పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

గార్ల : సీపీఎస్ రద్దు కోరుతూ టీఎస్‌సీపీఎస్‌ఈయూ తలపెట్టిన పాద పెన్షన్ సాధన సంకల్ప యాత్ర వాల్‌పోస్టర్లను స్థానిక జూనియర్ కళాశాలలో మండల ఉద్యోగులు గురువారం ఆవిష్కరించారు. రథయాత్ర ఈనెల 20న జిల్లాకు వస్తుందని ఉద్యోగులు పేర్కొన్నారు. కార్యక్రమంలో టీఎస్‌టీటీఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మాలోత్ శివ, డాక్టర్ రాజ్‌కుమార్, నాగేశ్వరరావు, భద్రునాయక్, రవి, బాలాజీ, వేణు, బాసు, వీరన్న, ఎం రామచంద్రు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుల ఎన్నిక

దంతాలపల్లి/గూడూరు/నెల్లికుదురు : కాంగ్రెస్ పార్టీ దంతాలపల్లి, గూడూరు, నెల్లికుదురు మండల అధ్యక్షులుగా గుగులోత్ బట్టు నాయక్, నూనావత్ రమేశ్‌నాయక్, గొల్లపల్లి ప్రభాకర్ గౌడ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా బట్టు నాయక్, రమేశ్ నాయక్, ప్రభాకర్ గౌడ్ ఆయా మండలాల్లో మీడియాతో మాట్లాడారు. తమను ఎన్నుకున్న నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు రేపు ఎంపిక

తొర్రూరు : రాష్ట్రంలోని హకీంపేట్ క్రీడా పాఠశాలలోని 4, 5 తరగతుల్లో ప్రవేశాలకు కోసం రేపు (శనివారం) స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌లో ఉదయం 10.30 గంటలకు అర్హులను మండల స్థాయిలో ఎంపిక చేయనున్నట్టు మండల నోడల్ అధికారి తుమ్మ వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయిలో ఎంపికైన వారిని జిల్లా స్థాయి ఎంపికలకు పంపించనున్నట్టు పేర్కొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా సరస్వతి



తొర్రూరు : స్థానిక మున్సిపల్ కమిషనర్‌గా పుప్పాల సరస్వతి పట్టణంలోని కార్యాలయంలో గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆమెను నియమిస్తూ పురపాలక శాఖ రాష్ట్ర డైరెక్టర్ సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. సరస్వతి గతంలో వికారాబాద్ జిల్లా ఆదిభట్ల మున్సిపల్ కమిషనర్‌గా పని చేశారు. అనంతరం రాష్ట్ర ఎన్నికల కమిషన్‌లో విధులు నిర్వహిస్తూ స్థానిక కమిషనర్‌గా నియమితులయ్యారు. ఇప్పటివరకు ఇన్‌చార్జ్ కమిషనర్‌గా ఎంపీడీఓ సింగారపు కుమార్ వ్యవహరించారు. సరస్వతిని మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, కౌన్సిలర్లు అభినందించారు.

రైల్వే కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కేసముద్రం : రైల్వే కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సికింద్రాబాద్ డివిజన్ కార్యదర్శి రవీందర్ కోరారు. మండల కేంద్రం నుంచి డోర్నకల్ వరకు శ్రామిక్ మార్చ్ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైల్వే కార్మికుల సమస్యల పరిష్కారం కోసం మజ్దూర్ యూనియన్ నిరంతరం పోరాడుతుందని చెప్పారు. నూతన పెన్షన్ విధానం రద్దు కోసం పోరాడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ వరంగల్ బ్రాంచ్ సెక్రటరీ యుగేందర్, డోర్నకల్ సెక్రటరీ అంజయ్య, ముకుందం, జానీ, బాబురావు, సుధాకర్, భాస్కర్, రమేష్, సురేష్ పాల్గొన్నారు.

క్వారీలో పేలుళ్లు.. తండావాసుల ఆందోళన

కేసముద్రం : ఓ క్వారీలో పేలుళ్లు జరపడంతో రాళ్లు దూసుకొచ్చి జనావాసాల్లో పడుతున్న ఘటన మండలంలోని నర్సింహులగుడెం జీపీలో గురువారం చోటుచేసుకుంది. తండావాసుల కథనం ప్రకారం.. తండాకు సమీపంలోని క్వారీలో బండరాళ్లను పగులగొట్టేందుకు నిర్వాహకులు పేలుళ్లు చేపట్టారు. దీంతో క్వారీ నుంచి రాళ్లు దూసుకువచ్చి తండాలోని ఇళ్ల మధ్య, రోడ్డుపై పడుతుండటంతో తండావాసులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఈ మేరకు క్వారీలో పేలుళ్లు జరపడం మూలంగా రాళ్లు ఎగిరివచ్చి పడుతున్నాయంటూ తండావాసులు గురువారం ఆందోళనకు దిగారు. పైగా పేలుళ్ల కారణంగా ఇళ్లకు బీటలు వస్తున్నాయంటూ క్వారీ వద్దకు చేరుకుని తండావాసులు నిరసన తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని, ఆందోళనకారులను శాంతింపజేశారు. క్వారీలో పేలుళ్లు జరపకుండా చర్యలు తీసుకోవాలని తండావాసులు పోలీసులను కోరారు.